క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో మంత్రి వేణుగోపాలకృష్ణ



మంత్రి వేణుగోపాలకృష్ణకు స్వాగతం పలుకుతున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో భ్రమరాంబ మంత్రికి అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్, పీఆర్వో నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు మార్పు చేయనున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెందుర్తి ఏఈ బోకం రవి తెలిపారు. మండలంలోని అక్కిరెడ్డి పాలెం,బంధవానిపాలెం, బొడ్డపూడిపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేప్‌కిన్స్ తయారీలో శిక్షణ



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంపత్‌కుమార్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీలోని శ్రీ లిఖి ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మై ప్యాడ్ మై రైట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నాబార్డ్ డీడీఎం సపంత్‌కుమార్ ప్రారంభించారు. మహిళలు శానిటరీ నేప్‌కిన్స్ వాడడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. శానిటరీ నేప్‌కిన్స్ తయారీ శిక్షణ తరగతులను ప్రారంభించారు.ముంబైకి చెందిన నాబార్డ్ ఫౌండేషన్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు శ్రీలిఖి ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జి.మాధవి తెలిపారు.

వి.వి.రామారావుకు ఏఐటీయూసీ నివాళి

ఉక్కునగరం: ఏఐటీయూసీ జాతీయ నాయకుడు వి.వి.రామారావు ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి రామారావు జీవిత కాలం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డి. ఆదినారాయణ, అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు, జె.రామకృష్ణ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న అక్రమార్కులు !

- అనకపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం
- అడ్డుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది



కబ్జాకు గురైన స్థలాన్ని ఆనుకుని ప్రభుత్వ స్థలంలో మరో నిర్మాణానికి వేసిన పునాదులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధిలో అక్రమార్కులు ప్రభుత్వ భూములపై వాలిపోతున్నారు. ఖాళీ భూమి కనిపిస్తే కబ్జా చేస్తున్నారు.అసకపల్లి రెవెన్యూలో ప్రభుత్వ భూములు మండల కేంద్రం సబ్బవరంతో పాటు జాతీయ రహదారిని ఆనుకుని ఉండడంతో ఎకరా భూమి కోట్లలో పలుకుతోంది. దీంతో గ్రామంలో విలువైన ప్రభుత్వ భూములపై కబ్జాదారులు కన్నేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ప్రభుత్వ భూములను అనుకుని జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్‌లో గృహ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. చుట్టు పక్కల ప్రైవేటు లే అవుట్‌లు ఉన్నాయి. దీంతో అక్రమార్కులు కబ్జా చేసిన ప్రభుత్వ భూములను ప్లాట్లుగా వేసి క్రయ విక్రయాలు చేపడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. రెవెన్యూ అధికారులు ఆక్రమణలు అడ్డుకోలేక తలలు పట్టుకుంటున్నారు.

తాజాగా సర్వే నంబర్–1లో..

అసకపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 1లో ప్రభుత్వ భూమి కబ్జా పర్వం వెలుగులోకి వచ్చింది. దీంతో రెవెన్యూ సిబ్బంది మంగళవారం ఆక్రమణలను అడ్డుకున్నారు. తహసీల్దార్ సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆక్రమణకు గురైన కొండ పోరంబోకు భూమిలో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో జయశ్రీ తదితరులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి సుమారు 80 సెంట్లు నుంచి ఎకరం ఉంటుందని బహిరంగ మార్కెట్లో దాని విలువ రూ.4 కోట్లు పైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములను సెలవు దినాల్లో పొక్లెయిన్‌లతో చదును చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. దీనికి సమీపంలోని మరో ప్రభుత్వ స్థలంలో పక్కా భవనం నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నిర్మాణం చేపడుతున్న స్థలంపై ఫిర్యాదులు రావడంతో గతంలోనే రెవెన్యూ అధికారులు తొలగించారు. తాజాగా యధావిధిగా నిర్మాణాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.




అసకపల్లిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మర్యాద పూర్వక కలయిక



విశాఖ పర్యటనకు మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో సీఎంకు పుష్పగుచ్ఛం అందజేశారు. విశాఖకు అన్ని అంశాల్లో ప్రాధాన్యం ఇస్తున్నందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే



ఆంధ్రాయూనివర్సిటీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, వైఎస్సార్‌సీపీ విశాఖ జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

– పరవాడ

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



జీవన ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పరవాడ: ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు వేసే రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి చెప్పారు. ఖరీఫ్ రైతులకు ఆమె పలు సూచనలు, సలహాలు అందించారు. మండలంలోని కలపాక, స్వయంభూవరం, వెన్నలపాలెం, రావాడ, భర్నికం , తానాం, పరవాడ గ్రామాల్లో వరి సాగు సమాయత్తమవుతున్న రైతులు పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగు ఎరువులను దమ్ములో వేసి కలియదున్నాలని సూచించారు. దమ్ములో ఎకరా పొలానికి 150 కిలోల సూపర్ పాస్పేట్, 20 కిలోల పొటాష్, 30 కిలోల యూరియా చల్లి ఊభాలు వేసుకోవాలని వివరించారు. పంట పొలంలో వరి నారును చదరపు మీటరుకు 33 కుదుళ్ల వచ్చేలా నాట్లు వేసుకుంటే మెరుగైన దిగుబడులు పొందవచ్చునని సూచించారు. ద్రవరూప జీవన ఎరువులైన అజోస్పైరిల్లం, పి.ఎస్.బి పొటాషియం, రిలీజింగ్ బ్యాక్టీరియా ఒక్కో రకం అర లీటరు చొప్పున 100 కిలోల గెత్తంలో కలిపి ఒక రోజు నిల్వ చేసి తదుపరి ఎకర పొలంలో చల్లు కోవాలన్నారు. దాని ద్వారా నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి మెరుగైన దిగుబడులు పొందవచ్చునని చెప్పారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది.

ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

శాస్త్రోక్తంగా గరుడసేవ .. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

నేడు సబ్బవరం పీహెచ్‌సీ ఆధునికీకరణకు శంకుస్థాపన

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధునికీకరణ పనులతో పాటు అదనపు భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.1.50 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు,పార్టీ సీనియర్ నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఘనంగా అప్పన్న తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పౌర్ణమి పురస్కరించుకుని మంగళవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను పల్లకిలో అధిష్టంపజేశారు. ఆలయ బేడామండపంలో సాయంత్రం తిరువీధి ఘనంగా నిర్వహించారు.

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు



రమాసహిత సత్యనారాయణస్వామి



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: అధిక శ్రావణ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక వ్రతాలు ఆచరించారు. వేకువజాము నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి, మంచినీటి సదుపాయం కల్పించారు. ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు నేతృత్వంలో వ్రతాలు చేశారు. గాజువాక, నరసాపురం నుంచి వచ్చిన మహిళలు కోలాటం ప్రదర్శించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ నాగ జగదీష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భవిత కేంద్రాలతో దివ్యాంగులకు మేలు



భవిత కేంద్రాన్ని సందర్శించిన జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

పరవాడ: భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందించాలని భవిత కేంద్ర నిర్వాహకులకు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.శకుంతల సూచించారు. ఆమె మంగళవారం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అలవెన్సులు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిత సెంటర్ విద్యార్థులు చదువుపై చూపుతున్న శ్రద్ధను ఆమె అభినందించారు. ఆటపాటల్లో చురుకుదనం ప్రదర్శించిన విద్యార్థులను సహిత విద్య సమన్వయకర్త శకుంతల అభినందించారు. కార్యక్రమంలో భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసులు, వలంటీరు పాల్గొన్నారు.

10న జిల్లా కేంద్రాల్లో నిరసనలు

పరవాడ: గ్రామ పంచాయతీ నిధులు మళ్లించడాన్ని నిరసిస్తూ ఈ నెల 10న జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియనున్నట్టు బీజేపీ జిల్లా ఇన్‌చార్జి వై.మాలకొండయ్య తెలిపారు. పరవాడలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్రం మంజూరు చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పంచాయతీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈర్లె శ్రీరామ్మూర్తి, కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి పి.రవిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బీవీఎస్ వర్మ, చదరం నాగేశ్వరరావు, పట్టాభి ప్రసాద్, కార్యవర్గ సభ్యులు గండి సమోబాబు పాల్గొన్నారు.

17 నుంచి సీపీఐ బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం ఈ నెల 17 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించనున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి ప్రారంభం కానున్న యాత్రను సీపీఐ జాతీయ కార్యదర్శి, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ ప్రారంభిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమాలు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎం.ఎస్. అప్పారావు, కసిరెడ్డి సత్యనారాయణ, జె.రామకృష్ణ, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేపట్టారు. సీఆర్ఎంపీ, టీపీపీ విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ప్రత్యేక అలవెన్సులు చెల్లించాలని, స్కిల్డ్ కార్మికులకు బోనస్, ఎక్స్‌గ్రేషియా అమలు చేయాలని కోరారు. అనంతరం ఆయా విభాగాధిపతులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి రవి, నమ్మి రమణ, రామరెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం దిగి వచ్చేవరకు ఉద్యమం



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు ఉద్యమం కొనసాగిస్తామని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 901వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహనీయుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

29వ రోజుకు గంగవరం పోర్టు కార్మికుల దీక్షలు



దీక్షా శిబిరంలో కూర్చున్న గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద చేపట్టిన నిరవధిక దీక్షలు మంగళవారానికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన వారికి అన్యాయం చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాద అప్పారావు, కదిరి సత్యానందం, కదిరి సత్తెయ్య, ఓలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



వెంకన్న కల్యాణం నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు రామానుజమ్

సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి చాతుర్మాస కల్యాణాలు, హవానాలు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈనెల 16వతేదీ వరకు ప్రతీరోజు స్వామివారికి కల్యాణం, పారాయణాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే మన్యుసూక్త హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

దేవమాత మహోత్సవాలు ప్రారంభం



తేరు స్వరూపాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ జాన్ ప్రకాశ్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) ఆధ్వర్యంలో దేవమాత మోక్షారోహణ ఉత్సవాలు మంగళవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ నేతృత్వంలో దివ్యబలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా దేవమాత పతాకాన్ని పీపీసీ అధ్యక్షుడు వై.వి.అమర్‌దీప్ ఆవిష్కరించారు. అనంతరం తేరును ఊరేగించారు.